సాక్షి
కుమురం భీం

గురువారం ◆ 6 ◆ ఏప్రిల్ ◆ 2023



పాల కేంద్రం ప్రారంభించండి..
చెన్నూర్‌లో పాల శీతల కేంద్రాన్ని 2013లో మూసివేశారు. పాడి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పాల డెయిరీని పునఃప్రారంభించాలని పాడిరైతులు కోరుతున్నారు. 8లో▸



దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు
ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. బుధవారం పలుచోట్ల చలివేంద్రాలను ప్రారంభించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.9/24.6

వాతావరణం
ఆకాశం కొంత మేర మేఘావృతమౌతుంది. పగటి పూట ఎండ, వేడి తీవ్రత కొనసాగుతుంది. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి


మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పలు కారణాలతో నిలిచిన ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు షెడ్యూల్ ప్రకారం చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో బుధవారం సంఘం ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జూలై నుంచి నూతన పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా ప్రభావితమైన భార్యాభర్తలను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు అన్నిరకాల పెండింగ్ బిల్లులు సత్వరమే విడుదల చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, రాష్ట్ర కార్యదర్శి నగేశ్, సభ్యులు రాజశేఖర్, బాజీరావు, జగన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

28న పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

కాగజ్‌నగర్‌టౌన్: ఈ నెల 28న పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు బాలభారతి ఎడ్యూకేషనల్ సొసైటీ చైర్మన్ ఖాజా వసిమోద్దీన్ తెలిపారు. పట్టణంలోని పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1963 ఏప్రిల్ 28న పాఠశాల ప్రారంభమైందని, 60 ఏళ్ల కాలంలో సుమారు 10 వేల మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించి దేశవిదేశాల్లో స్థిరపడినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 60 ఏళ్లలో చదివిన విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు 83284 29208, 90108 90500 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గోలేటి సీహెచ్‌పీలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఇన్‌చార్జి డీజీఎం రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుపేర్లతో పనిచేస్తున్న సింగరేణి కార్మికుల అసలు పేర్లను రికార్డులో నమోదు చేయాలన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో పనివేళలు మార్చి, కాంట్రాక్టు కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందించాలని కోరారు. ప్రతినెలా 10లోగా వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు రాజన్న, శోభన్, మహేందర్, రవి, నాగరాజు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

మెనూపై పట్టింపేది?

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అందని పోషకాహారం
- నాణ్యత లేని ఆహారంతో రోగులకు తిప్పలు
- ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బలవర్ధకమైన ఆహారం అందడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయకపోవడంతో చికిత్స కోసం ఆస్పత్రిలో చేరేవారు ఆకలితో అలమటిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు చాలా మంది నిరుపేదలే చికిత్స కోసం వస్తుంటారు. ఆర్థికంగా స్థోమత లేనివారు, మారుమూల గ్రామాల నుంచి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేనివారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. వ్యాధులు, జ్వరాలు, ప్రమాదాల బారినపడిన వారు వేగంగా కోలుకునేందుకు బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. అయితే క్షేత్రస్థాయిలో ఇది సక్రమంగా అమలు కావడం లేదు. అవగాహన లేని ఆదివాసీలు, నిరుపేద రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో నిర్వాహకులు పెట్టిందే తింటున్నారు. బుధవారం ఆసుపత్రిని 'సాక్షి' విజిట్ చేయగా మెనూ ప్రకారం భోజనం ఇవ్వడం లేదని పలువురు రోగులు వాపోయారు. రోగులు 30 మంది చికిత్స పొందుతుండగా మిల్‌మిక్కర్ కర్రీ, నీళ్ల చారుతో భోజనం పెట్టారు. కేవలం బాలింతలకు మాత్రమే గుడ్లు ఇచ్చారు. ఆసుపత్రి గోడపై ప్రదర్శనకు ఉంచి మెనూకు.. రోగులకు అందిస్తున్న భోజనానికి సంబంధం ఉండటం లేదు. అయితే అధికారులు మాత్రం ప్రతినెలా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే మెనూ పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.


రోగులకు గుడ్డు లేకుండా వడ్డించిన భోజనం

ఇంటి నుంచే భోజనాలు..
ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అందించే భోజనం నాణ్యతగా లేకపోవడంతో చాలా మంది తినేందుకు కూడా ఇష్టపడటం లేదు. నీళ్లచారు, చాలీచాలని కూరతో వడ్డిస్తున్న భోజనం సరిపోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొంత మంది ఆసుపత్రిలో పెట్టే భోజనం తినక ఇంటి నుంచి తెచ్చుకుని తింటున్నారు. రాత్రి ఇవ్వాల్సిన భోజనం కూడా సక్రమంగా అందించడం లేదని రోగులు వాపోయారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణ లేకపోవడం, చూసీచూడనట్లు వ్యవహరించడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. ఇటీవల ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించినప్పటికీ నిర్వహణ తీరులో మార్పు కానరావడం లేదు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వామిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇదీ ఆహార పట్టిక..
ప్రభుత్వాసుపత్రిలో ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఇన్‌పేషెంట్లు నమోదవుతున్నారు. బుధవారం ఆసుపత్రిలో 30 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. వారికి సరైన భోజనం అందించలేదు. ప్రతిరోజూ రోగులకు అందించాల్సిన అల్పాహారంలో 150 గ్రాముల ఇడ్లీలు, సాంబారు, 100 గ్రాముల చట్నీ, రవ్వతో చేసిన చట్నీ 100 గ్రాములు, ఒకసారి 100 మిల్లీలీటర్ల పాలు చక్కరతో కలిసి ఇవ్వాలి. అయితే అల్పాహారంలో ఇడ్లీ ఇవ్వకుండా కేవలం ఉప్మారవ్వ మాత్రమే వడ్డిస్తున్నారు. మధ్యాహ్నం భోజనంలో 300 గ్రాముల బియ్యంతో వండిన అన్నం, 100 గ్రాముల కర్రీ, 150 గ్రాముల సాంబార్, ఒక కోడిగుడ్డు, 200 మిల్లీ లీటర్ల మజ్జిగ, రాత్రి 300 గ్రాముల బియ్యంతో అన్నం, 100 గ్రాముల కూరగాయలతో వండిన కూర, 150 గ్రాముల సాంబార్, ఒక అరటి పండు, పాలు ఇవ్వాల్సి ఉంటుంది.

గుడ్డు ఇవ్వడంలేదు



బీపీ సమస్యతో మంగళవారం రాత్రి ఆసుపత్రిలో చేరా. మధ్యాహ్నం అందించిన భోజనంలో కోడిగుడ్డు ఇవ్వలేదు. దీంతో తప్పని పరిస్థితిలో నిర్వాహకులు పెట్టిందే తినాల్సి వస్తోంది. రోగులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి.
– జి.బాలేశ్, హడ్కోకాలనీ, ఆసిఫాబాద్

జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయం


నివాళులర్పిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎస్పీ సురేశ్‌కుమార్, తదితరులు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నివాళి

ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో బుధవారం జగ్జీవన్‌రామ్ 116 జయంతి వేడుకలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భారత రాజ్యాంగ సభ సభ్యుడిగా, ఉప ప్రధానిగా, మంత్రిగా, ఎంపీగా ఆయన పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..
జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల నుంచి వచ్చి 40 ఏళ్ల పాటు పార్లమెంట్‌లో సేవలందించారని తెలిపారు. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తూ రాజకీయ జీవితాన్ని ఆదర్శప్రాయంగా కొనసాగించారని కొనియాడారు. మచ్చలేని నాయకుడిగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఆర్ఐ అడ్మిన్ భరత్ భూషణ్, సిబ్బంది లావణ్య, కిరణ్, రాజశేఖర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కుట్ర బీజేపీదే

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ఆసిఫాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కుట్ర బీజేపీ నాయకులదేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు రాజశేఖర రెడ్డి ద్వారా కొన్ని చీడ పురుగులు కుట్ర చేశాయన్నారు. అదే తరహాలో పదో తరగతి పరీక్షల పేపర్ లీకేజీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే పోలీసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేశారని తెలిపారు. ప్రశాంత్ అనే వ్యక్తి వాట్సాప్ ద్వారా బండి సంజయ్‌కి ప్రశ్నాపత్రం పంపారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అస్థిర పరిచేందుకు ఎమ్మెల్యేల కొనుగోళ్లు, మత కల్లోలాలు, పేపర్ లీకేజీల పేరుతో కుటిల యత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ నాయకులు చేస్తున్న చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలి

- ఎమ్మెల్సీ దండె విఠల్
- జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

ఆసిఫాబాద్: బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ సమీపంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్‌పై విపక్షాలు చేసే దుష్ప్రచారాలపై దీటుగా ప్రతిఘటించాలన్నారు. పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ ఆసిఫాబాద్ మండలంలోనే ప్రతినెలా 4,315 మందికి రూ.14 కోట్ల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో రూ.160 కోట్ల రైతుబంధు, రూ.84 లక్షల రైతుబీమా అందించామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోడు భూముల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా నుంచి ప్రారంభించాలని సీఎంను కోరనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ద్వారా జిల్లాకు రూ.100 కోట్లు నిధులు మంజూరయ్యాయని, డీఎంఎఫ్‌టీ కింద ఆసిఫాబాద్ నియోజకవర్గానికి రూ.40 కోట్లతో సీసీ రోడ్లు వేసినట్లు వెల్లడించారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు కోరిక మేరకు 40 ఏళ్లుగా నిరీక్షిస్తున్న గుండి, అప్పపెల్లి బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, తెలంగాణ కోసం పాటుపడిన ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం పార్టీలో అర్హులైన కార్యకర్తలకు వర్తింపజేస్తామన్నారు. కార్యకర్తల పరిస్థితి అధ్వానంగా ఉందని, నిరుత్సాహంలో ఉన్న కార్యకర్తలకు న్యాయం చేయాలని సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ కోరారు. కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుల ద్వారా సాగునీరందించాలని, తెలంగాణ ఉద్యమంలో మృతి చెందిన వారికి పరిహారం చెల్లించాలని, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని పలువురు నాయకులు కోరారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, మండల అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు జగ్గన్న, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకన్న, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, నాయకులు సయ్యద్ అన్వార్, సీహెచ్ రవి, సుప్రజ, రమేశ్, అబ్దుల్లా, అహ్మద్ బిన్ అబ్దుల్లా, లాలా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

- బండి సంజయ్ అరెస్ట్‌పై జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణుల నిరసన
- బీఆర్ఎస్ దిష్టిబొమ్మ దహనం
- బీజేపీ నాయకుల అరెస్టు

ఆసిఫాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాస్వామ్యం మంటగలిసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ వైఖరిని తీవ్రంగా ఖండించారు. పోలీసులు బీజేపీ నాయకులను అరెస్టు చేసి కెరమెరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్, జిల్లా కార్యదర్శి భాస్కర్, మండల అధ్యక్షుడు ఈదులవాడ గణేశ్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జైరాజ్, మేడి కార్తీక్, సుంకె కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణ పోలీసులు బుధవారం బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోలెం వెంకటేశ్ మాట్లాడుతూ ఎలాంటి కారణాలు లేకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో భయపడేది లేదని తేల్చి చెప్పారు.


జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కీలక విధులు.. భద్రత గుబులు

విద్యుత్ సరఫరాలో ఏ లోపం వచ్చినా వెంటనే వారు రంగంలోకి దిగి మరమ్మతులు చేస్తారు. ప్రాణాలకు తెగించిన ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించినా వారికి వచ్చే వేతనం తక్కువ. ఉద్యోగ భద్రత అంతంతే. ఇదీ టీఎస్ ఎన్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్న వందలాది మంది ప్రత్యామ్నాయ(అన్‌మ్యాన్డ్) కార్మికుల దయనీయ పరిస్థితి.

- విద్యుత్ శాఖలో అన్‌మ్యాన్డ్ కార్మికులకు తప్పని అవస్థలు
- క్షేత్రస్థాయిలో వీరి సేవలే కీలకం..
- చాలీచాలని వేతనాలతో ఏళ్లుగా ఆర్థిక ఇబ్బందులు
- డిమాండ్లు నెరవేర్చాలని వేడుకోలు


కౌటాల విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు చేస్తున్న అన్‌మ్యాన్డ్ కార్మికుడు

కౌటాల(సిర్పూర్): సాధారణంగా విద్యుత్ శాఖ ఉద్యోగులకు జీతాలు అధికంగా ఉంటాయి. కానీ అదే శాఖలో పనిచేసే అన్‌మ్యాన్డ్ కార్మికుల పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. చేసిన పనికి వచ్చే జీతానికి పొంతన ఉండటం లేదు. నిజానికి వీరు సంస్థ ఉద్యోగులకు సహాయకులు మాత్రమే అయినా వీరు ఎలాంటి సమస్య తలెత్తినా ముందుండి పనులు చేస్తుంటారు. టీఎస్ ఎన్‌పీడీసీఎల్‌లో 2013 నుంచి అన్‌మ్యాన్డ్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు బారిన పడుతున్నా తగిన సాయం అందడం లేదు.

క్షేత్రస్థాయిలో కీలకం..
స్థానికంగా కట్టర్లు, ప్రత్యామ్నాయ కార్మికులుగా పిలిచే వీరి పని డీటీఆర్‌ల వద్ద, ఇతర ప్రాంతాల్లో అడ్డుగా ఉన్న చెట్లను కొట్టడం, కాలిపోయిన ఫ్యూజులు వేయడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు, బిల్లుల రీడింగ్, బకాయిల వసూలు, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, తొలగించడం తదితర పనులు చేస్తుంటారు. అలాగే రెగ్యులర్ సిబ్బందికి సాయంగా ఉంటూ విద్యుత్ స్తంభాలు ఎక్కడంతోపాటు శిక్షణ పొందిన జూనియర్ లైన్‌మెన్లతో చేయించాల్సిన పనులనూ వీరికే అప్పగిస్తున్నారు. ప్రారంభంలో వీరికి రూ.4వేలు కనీస వేతనంగా చెల్లించేవారు. ప్రస్తుతం రూ.8 వేలు చెల్లించేలా నిర్ణయించారు. విధుల్లో ప్రమాదానికి గురైతే కేవలం వైద్యచికిత్స కోసం క్రెడిట్ కార్డు మంజూరు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే కార్మికుడి కుటుంబం వీధిన పడుతోంది.

ఇవీ డిమాండ్లు
ఐటీఐ, డిప్లొమా విద్యార్హతలతో స్కిల్డ్, ఇతర విద్యార్హతలతో అన్‌స్కిల్డ్ వర్కర్లుగా విభజించి ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలని అన్‌మ్యాన్డ్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు సబ్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులను అన్‌మ్యాన్డ్ వర్కర్లతో భర్తీ చేయాలంటున్నారు. ప్రస్తుతం ఆపరేటర్లుగా పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులను తొలగించి అన్‌మ్యాన్డ్ వర్కర్లకు అవకాశాలు కల్పించాలి. ప్రతినెలా నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లోనే వేతనాలు చెల్లించాలని, జూనియర్ లైన్‌మెన్ నియామకాల్లో అన్‌మ్యాన్డ్ వర్కర్ల సీనియారిటీ ప్రకారం వెయిటేజ్ మార్కులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



టీఎస్ ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఏళ్లుగా శాశ్వత ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నాం. అయినా నెలకు రూ.8,450 మాత్రమే అందిస్తున్నారు. ఉప కేంద్రాల ఆపరేటర్లు, వాచ్‌మెన్‌లను ఆర్టిజన్లుగా గుర్తించి రూ.23 వేల వేతనం ఇస్తున్నారు. అన్‌మ్యాన్డ్ కార్మికులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.
– సుధాకర్, అన్‌మ్యాన్డ్ కార్మికుడు, కౌటాల

సమస్యలు పరిష్కరించాలి



సంస్థలో ఖాళీగా ఉన్న ఆపరేటర్ విశ్రాంత ఉద్యోగుల స్థానంలో అన్‌మ్యాన్డ్ కార్మిలకు అవకాశమివ్వాలి. అలాగే ఉద్యోగ నియామకాల్లో సీనియారిటీ ప్రకారం జేఎల్‌ఎం పోస్టుల్లో వెయిటేజీ మార్కులకు అవకాశం ఉండేలా చూడాలి. ప్రమాదానికి గురైతే వారికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి.
– సాగర్, అన్‌మ్యాన్డ్ కార్మికుడు, వీర్దండి

తరచూ ప్రమాదాలు..
టీఎస్ ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు ఖమ్మం, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల పరిధిలో దాదాపుగా 1,608 మంది అన్‌మ్యాన్డ్ కార్మికులు పని చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 302 మంది ఉన్నారు. వీరు ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యుత్ శాఖలో ప్రమాదవశాత్తు జరిగిన ఘటనల్లో కొంతమంది వైకల్యం బారిన పడగా మరికొంత మంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దక్షిణ డిస్కం పరిధిలో తమ లాగే పనిచేసిన వారికి ఆర్టిజన్లుగా అప్‌గ్రేడ్ చేశారని, ఎన్‌పీడీసీఎల్‌లో మాత్రం వెట్టి చాకిరీ చేయిస్తున్నారని కార్మికులు అంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు కేసు నమోదు చేయకుండా కొందరు అధికారులు, మధ్యవర్తులు పరిహారం ఇచ్చి సరిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ప్రమాదవశాత్తు చనిపోతే కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్డ్ వర్కర్లకు అందించే వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతిచెందిన చుక్కల దుప్పి

నెన్నెల: మండలంలోని జెండావెంకటపూర్ గ్రామశివారులో బుధవారం వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. అడవిలో నుంచి జనవాసాల్లోకి వచ్చిన దుప్పిని గమనించిన కుక్కల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గ్రామస్తులు కుక్కలను చెదరగొట్టి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే నార్వాయిపేట సెక్షన్ అధికారి ఏల్పుల శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని రక్షించే ప్రయత్నం చేశారు. పరిస్థితి విషమించి దుప్పి మృతిచెందింది. దుప్పి కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెన్నెల పశువైద్యశాలకు తరలించారు. బెల్లంపల్లి రేంజ్ కాంప్లెక్స్ ప్రాంతంలో దుప్పి కళేబరాన్ని దహనం చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం రెవెన్యూ అధికారులు రేషన్ బియ్యం పట్టుకున్నారు. రేషన్ షాపు నుంచి తీసుకున్న 1.50 క్వింటాళ్ల బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా డెప్యూటీ తహసీల్దార్ కమల్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీహరి పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెలలోనే బలవర్ధకమైన బియ్యం లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నప్పటికీ ఆ బియ్యాన్ని సైతం అమ్ముకుంటున్నారు.

108 అంబులెన్స్ తనిఖీ



తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం మేనేజర్

జన్నారం: జన్నారం మండల 108 అంబులెన్స్‌తోపాటు బైక్ అంబులెన్స్‌ను అంబులెన్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల్లోని పరికరాలతోపాటు సామర్థ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్ సేవలను అత్యవసరానికి వినియోగించుకోవాలని తెలిపారు. ఈఎంఈ కొండల్‌రావ్, ప్లేస్ కోఆర్డినేటర్ జనార్దన్, ఈఎంటీలు కిషన్, రవి, పైలెట్ రఫీక్ పాల్గొన్నారు.

పాల కేంద్రం ప్రారంభించండి



మూసివేసిన చెన్నూర్ పాలశీతల కేంద్రం(ఫైల్)

చెన్నూర్ వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడ పాడి రైతులు ఎక్కువే. వ్యవసాయంపై ఆదాయం నామమాత్రమే కావడంతో పాలతో కొంత ఉపాధి పొందుతున్న పాడి రైతుకు ఇక్కడి పాలకేంద్రం మూసివేయడంతో ఉన్న కాస్తా ఉపాధి కరువైంది. దీంతో పాల విక్రయానికి పడరాని పాట్లు పడాల్సిన దుస్థితి. ఇకనైనా అధికారులు, పాలకులు పట్టించుకుని స్థానికంగా మూసివేసిన పాల శీతల కేంద్రాన్ని తిరిగి ప్రారంభించి ఉపాధి కల్పించాలని పాడిరైతులు కోరుతున్నారు.

- చెన్నూర్‌లో 2013లో పాల డెయిరీ మూసివేత
- ఇంటింటికీ వెళ్లి పాలు అమ్ముకుంటున్న పాడి రైతులు
- చెన్నూర్‌తో పాటు నాలుగు మండలాల్లో 2వేల మంది..
- పాలశీతల కేంద్రాన్ని పునఃప్రారంభించాలని వేడుకోలు

చెన్నూర్: ఒకప్పుడు జిల్లాలోనే చెన్నూర్ పాలశీతల కేంద్రం రైతులతో కళకళలాడేది. పాలశీతల కేంద్రాల్లో పాలు విక్రయించడంతో వందలాది మంది రైతులకు ఉపాధి లభించేది. అధికారుల నిర్లక్ష్యం, అప్పటి ప్రభుత్వ పట్టింపులేని తనంతో రైతుల పాలిట శాపంగా మారింది. లాభాల బాటలో నడుస్తున్న పాలశీతల కేంద్రాన్ని అర్ధంతరంగా మూసివేశారు. కేంద్రం మూతపడి భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ స్థలాన్ని కేసీఆర్ పార్క్‌గా ఏర్పాటు చేశారు. దీంతో పాలు కొనుగోలు చేసేవారు లేక ఇంటింటికీ వెళ్లి రైతులే విక్రయించుకుంటున్నారు. ప్రస్తుతం చెన్నూర్, వేమనపల్లి, భీమారం నాలుగు మండలాల్లో 2వేల మంది పాడి రైతులున్నారు. కొందరు పాలను హోటళ్లు, ఇళ్లల్లో విక్రయిస్తుండగా మరికొందరు పాలు విక్రయాలు లేక నష్టాల పాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి పాడి రైతులను ఆదుకునేందుకు ఓ వైపు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో దరిచేరడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాడి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మూసివేసిన పాల డెయిరీని పునః ప్రారంభించాలని పాడిరైతులు కోరుతున్నారు.

చెన్నూర్‌లో...

చెన్నూర్‌లో 2003లో అప్పటి ప్రభుత్వం పాలశీతల కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ కేంద్రంలో మేనేజర్‌తో పాటు మరో 10 మంది సిబ్బంది పనిచేసేవారు. రోజుకు సుమారు 3వేల నుంచి 4వేల లీటర్ల పాలను సుమారుగా 800 మంది వరకు రైతులు విక్రయించేవారు. పాల శీతల కేంద్ర పరిధిలోని మండలాల్లోని గ్రామాలకు వెళ్లి ఆటోల ద్వారా పాలను సేకరించి నిజామాబాద్‌లోని ఏపీ డెయిరీకి తరలించేవారు. 2003 నుంచి 2008 వరకు పాలశీతల కేంద్రం లాభాల బాటలో పయనించింది. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడంతో పాడి రైతులు అభివృద్ధి దిశగా పయనించారు. తరువాత పాలశీతల కేంద్ర మేనేజర్ డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో క్రమంగా రైతులు కేంద్రానికి పాలను విక్రయించడం మానేశారు. కేంద్రానికి పాలు సక్రమంగా రాకపోవడంతో పాటు కేంద్రాల నిర్వహణ భారంగా మారడం, సిబ్బంది వేతనాలు చెల్లించకపోవడం, నష్టాల సాకు చూపుతూ అధికారులు చెన్నూర్ డెయిరీని 2013లో మూసివేశారు. దీంతో చెన్నూర్, కోటపల్లి, భీమారం గ్రామాలకు చెందిన రైతులు కొందరు నెయ్యి తయారు చేసి పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి పాల డెయిరీ ఏర్పాటు చేయాలని పాడి రైతులు వేడుకుంటున్నారు.

భవనాన్ని కేటాయిస్తే.. బీఎంసీ ఏర్పాటు చేస్తాం

చెన్నూర్‌లో పాల డెయిరీ మూసివేసిన విషయం తెలిసింది. అక్కడి మిషన్లు చెడిపోతుండడంతో లక్సెట్టిపేటకు తరలించాం. ప్రస్తుతానికి భవనం లేదు. అధికారులు భవనం ఇచ్చి విద్యుత్‌తో పాటు నీటి సౌకర్యం కల్పిస్తే ప్రస్తుతం వెయ్యి లీటర్ల పాల కొనుగోలు బీఎంసీ (బల్క్ మిల్క్ సెంటర్) పక్షం రోజుల్లో ఏర్పాటు చేస్తాం. పాల ఉత్పత్తి పెరిగితే 3వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్లు ఏర్పాటు చేస్తాం.

– మధుసూదన్‌రావు, పాల డెయిరీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీడీ

పాలశీతల కేంద్రం ఏర్పాటు చేయాలి



చెన్నూర్‌లో పాలశీతల కేంద్రం ఏర్పాటు చేయాలి. పాల డెయిరీ లేక తిప్పలు పడుతున్నాం. అధికారులు స్పందించి కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానిక రైతులకు ఎంతో మేలు జరుగనుంది.

–శకుంతల కొత్తపల్లి రాజారాం, కోటపల్లి

ఆటో చోరీ.. పట్టుకున్న డ్రైవర్లు



ఆటోను పట్టుకున్న డ్రైవర్లు

కాగజ్‌నగర్‌టౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో పార్కింగ్ చేసిన ఆటోను బుధవారం గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం కర్జెల్లి నివాసి లచ్చన్న తన ఆటోను ఎస్‌బీఐ వద్ద పార్కింగ్ చేసి సెల్ ఫోన్ కొనుగోలు చేసి వచ్చే సరికి ఆటో చోరీకి గురైంది. బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఆటోను పర్ధాన్‌గూడ గ్రామానికి చెందిన వెంకటేష్ అపహరించి బస్టాండ్ మీదుగా వెళ్తుండగా ఆటో డ్రైవర్లు చాకచక్యంగా పట్టుకొని నిందితుడితో పాటు ఆటోను పోలీసులకు అప్పగించారు.

ఓబీ లక్ష్యాలు సాధించాలి

శ్రీరాంపూర్: ఓసీపీల్లో ఓవర్ బర్డెన్ మట్టి(ఓబీ) వెలికితీత లక్ష్యాలను సాధించాలని కంపెనీ డైరెక్టర్లు తెలిపారు. బుధవారం డైరెక్టర్(ఆపరేషన్స్), డైరెక్టర్(పీపీ) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి శ్రీరాంపూర్ ఓసీపీ, ఇందారం ఓసీపీలో ఓబీ లక్ష్యాలపై డైరెక్టర్లకు వివరించారు. నిర్దేశించిన ఓబీ తీసినప్పుడే బొగ్గు వెలికితీసుకొనే అవకాశం ఉంటుందని, ఓబీ తీయడంలో జాప్యం చేయవద్దని డైరెక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఓసీపీ అధికారి పురుషోత్తంరెడ్డి, ఇందారం ఓసీపీ అధికారి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామానికి చెందిన కంది తిరుపతి(47) ఇంటి సమీపంలోని బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన తిరుపతి బుధవారం ఉదయం బావి వద్దకు స్నానం చేయడానికి వెళ్లాడు. బావిలో నీళ్లోల్ తోడే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. తండ్రి పులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

జీఆర్ఎన్ క్యాంపు వద్ద ఉద్రిక్తత

- ఫర్నిచర్ ధ్వంసం, సిబ్బందిపై దాడి



జీఆర్ఎస్ క్యాంపు వద్ద భూనిర్వాసితులు

రెబ్బెన(ఆసిఫాబాద్): స్థానికులకే ఓబీ కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని బెల్లంపల్లి ఏరియాలోని భూనిర్వాసిత ప్రాంతాల నుంచి యువకులు, మహిళలు మంగళవారం పెద్ద ఎత్తున కైరిగూడ ఓసీపీలో ఓబీ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ జీఆర్ఎన్ క్యాంపునకు చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఓబీ కంపెనీలో స్థానికులకే ఉపాధి అవకాశం కల్పించాలని గత కొన్ని రోజులుగా చేపడుతున్న ఆందోళన తారా స్థాయికి చేరుకుంది. సింగరేణి ఓసీపీల ఏర్పాటు కోసం భూములు తీసుకుని ఓబీ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి తీరా ఓసీపీలో పనులు ప్రారంభమయ్యాక వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులను తీసుకొచ్చి పనులు కల్పిస్తున్నారని ఆగ్రహించారు. వివిధ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన కార్మికులను వెంటనే పంపించాలని డిమాండ్‌చేస్తూ జీఆర్ఎన్ క్యాంపులోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జీఆర్ఎన్‌లో పనిచేస్తున్న పలువురు సిబ్బందిపై దాడి చేయడంతో పాటు క్యాంపులోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న తిర్యాణి, రెబ్బెన పోలీసులు భారీ బందోబస్తుతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి క్యాంపు నుంచి బయటకు పంపించారు.

20 మందిపై కేసు నమోదు...

తిర్యాణి: జీఆర్ఎన్ క్యాంపుల్లోకి వెళ్లి ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు సిబ్బందిపై భూనిర్వాసితులు దాడికి పాల్పడ్డారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు దాడిచేసిన 20మందిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

నస్పూర్: హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం పక్కన డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

మాదిగ హక్కుల దండోరా జిల్లా కమిటీ ఎన్నిక

మాదిగ హక్కుల దండోరా జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు సునీల్ మాదిగ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా కడారి రమేష్(చెన్నూర్), కార్యనిర్వాహక అధ్యక్షులుగా నాతరి కిరణ్ మాదిగ(బెల్లంపల్లి), రామంచ కుమార్‌మాదిగ(మందమర్రి), తగురపు సత్తయ్య మాదిగ(లక్షెట్టిపేట), ఉపాధ్యక్షులుగా తాండ్ర లింగయ్యమాదిగ, అయిల్ల స్వామి మాదిగ, రేణికుంట్ల పోషం మాదిగ, జనంపల్లి బానేష్‌మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా చొప్పదండి అరుణ్‌కుమార్, రామగిరి స్వామి మాదిగ, ఆసంపల్లి శ్రీనివాస్ మాదిగ, సప్పిడి నరేశ్ మాదిగ, అధికార ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రాపల్లిలో 'బలగం' ప్రదర్శన..



రాపల్లిలో బలగం సినిమా వీక్షిస్తున్న స్థానికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామీణ కుటుంబ భావోద్వేగాలతో పాటు మానవ బంధాలే ముఖ్యం అని చాటి చెప్పిన చిత్రం 'బలగం'..ఈ సినిమా అందరినీ అలరిస్తూ కంటి తడిపెట్టిస్తోంది. పల్లెలో ఎల్‌ఈడీలు పెట్టి మరీ గ్రామస్తులకు ఉచితంగా చిత్ర ప్రదర్శన ఇస్తున్నారు. రాపల్లి సర్పంచ్ మల్లేశ్ 'బలగం' సినిమాను గ్రామస్తులు అంతా కలిసి ఒకే చోట వీక్షించాలని భావించి బుధవారం పంచాయతీ ఆవరణలో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. హాజీపూర్ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత వీక్షించారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ కన్వీనర్‌గా ప్రవీణ్‌కుమార్



నియామక పత్రం అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(140/2018) శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్‌గా డేగల ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. మంగళవారం రాత్రి సీసీసీలోని సింగరేణి గెస్టు హౌజ్ కాన్ఫరెన్సు హాల్‌లో డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆంతోటి నాగేశ్వర్‌రావు, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ కనుగుంట్ల తిరుపతి, కేంద్ర కమిటీ సభ్యుడు ఇరుగులాల శంకర్‌లు హాజరయ్యారు. వారు శ్రీరాంపూర్ ఏరియా పాత కమిటీని రద్దు చేసి దాని స్థానంలో నూతన కమిటీని నియమించారు. కన్వీనర్‌గా డేగల ప్రవీణ్‌కుమార్‌తో పాటు చీఫ్ అడ్వైజర్‌లుగా సంతోశ్‌కుమార్(డీజీఎం), ఈర్ల తిరుపతి(ఎస్ఓఎం), వేము రాధాకృష్ణ(డీవైఎస్ఈ), అడ్వైజర్‌గా పత్తి రామస్వామి, ఏరియా సెక్రెటరీలుగా రెడపాక లక్ష్మణ్, నక్క సుమన్, ట్రెజరర్‌గా గోదారి మురళీ, జాయింట్ సెక్రెటరీలుగా జంగంపల్లి కమల్‌కుమార్, శెట్టి శంకరయ్య, అందె వెంకటేశ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వేల్పుల ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కే జోసఫ్, రవిబాబు, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా కుక్క వాసు, సుందిళ్ల నరేశ్, జనగామ వెంకటేశ్‌లను నియమించారు. నూతన కమిటీకి నియమాక పత్రాలను జీఎం సంజీవరెడ్డి అందజేశారు.

పాముకాటుకు చిన్నారి మృతి



హర్షిత (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): బుజ్జిబుజ్జి మాటలతో కుటుంబంలో సందడి నింపే ఈ చిన్నారి మాటలు మూగబోయాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆడిపాడి నిద్రకు ఉపక్రమించిన సమయంలో పాముకాటు రూపంలో మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన వడ్లూరి రాజు, సౌజన్య దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో రెండో సంతానమైన హర్షిత (9) 3వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. హర్షిత రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి నేల మీదే పడుకుంది. రాత్రి కుడి చేతిపై ఏదో కాటు వేయడంతో మంటగా ఉందని తల్లిదండ్రులను నిద్రలేపింది. అప్పటికే చేయి వాపు రాగ నోట మాట మారిపోయింది. హుటాహుటిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే హర్షిత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

క్యాడర్ స్కీం పదోన్నతి ఆర్డర్ పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో బుధవారం పది మంది క్యాడర్ స్కీం ప్రమోషన్ ఆర్డర్ పత్రాలను జీఎం దేవేందర్ ఉద్యోగులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో పదోన్నతులు వ్యక్తి పనిపట్ల మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, పీవో ఉమాకాంత్, పీఈ రాజాజీ, మేనేజర్ ప్రవీణ్‌ఫటింగ్, టీబీజీకేఎస్ నాయకులు వెంకటేశం, చంద్రశేఖర్, సీనియర్ పీవో వేణులు పాల్గొన్నారు.

క్లరికల్ ఉద్యోగులకు నియామక పత్రాలు అందచేత..

సింగరేణిలో నిర్వహించిన ఇంటర్నల్ ఎగ్జామ్ ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఉద్యోగులకు జీఎం దేవేందర్ నియామక పత్రాలను అందచేవారు. ఇటీవల నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఏరియాకు వచ్చిన 44 మంది ఉద్యోగుల్లో 43 మంది హాజరయ్యారు. వారికి ఆఫీస్ ఆర్డర్ కాపీలను జీఎం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఎస్‌వోటూజీఎం గుప్తా, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహారా తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన పంటనష్టం సర్వే

- 308 ఎకరాల్లో నష్టం



దండేపల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత నెలలో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి నివేదికను బుధవారం ప్రభుత్వానికి అందజేశారు. గత నెలలో ప్రాథమిక సర్వే చేపట్టిన అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో వ్యవసాయ, విస్తరణ అధికారి (ఏఈవో)తో పాటు, ఉద్యానవన శాఖ, వీఆర్ఏ కలిసి దెబ్బతిన్న వివిధ పంట పొలాలను సర్వే చేసి అందుకు అనుగుణంగా గ్రామాల వారీగా రైతుల పేర్లు, ఇతర వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించడంతో ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం గ్రామాల వారీగా సర్వే చేపట్టారు. పంట నష్టం సర్వేలో ఎలాంటి పొరపాట్లు తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 33 శాతం కన్న ఎక్కువగా నష్టపోయిన పంటలను గుర్తించారు. దండేపల్లి మండలంలోని 8 గ్రామాలు, హాజీపూర్ మండలంలోని నమ్నూర్, మందమర్రి మండలంలోని సారంగపల్లి, జన్నారం మండలంలోని రాంపూర్, తిమ్మపూర్, సింగరాయిపేట, రోటిగూడ గ్రామాలలో వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడి పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. మొత్తం 13 గ్రామాలలో 297 మంది రైతులకు చెందిన 308 ఎకరాల్లో జరిగిన నష్టాన్ని నమోదు చేసి ప్రభుత్వానికి అందజేశారు. ఈ నష్టానికి ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ.10వేల చొప్పున మొత్తం రూ. 30లక్షల 80 వేలు రైతులకు అందించాల్సి ఉంది.

33 శాతంపైన దెబ్బతిన్న పంటలకే..

జిల్లాలో మార్చి 16 నుంచి 21 తేదీలలో వడగళ్ల వర్షం పడింది. ఈ వర్షానికి దండేపల్లి, జన్నారం, హాజీపూర్, మందమర్రి మండలాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలబారాయి, మిర్చి, మామిడి పంటలు కాయాలు నేలరాలాయి. మొక్కజొన్న, వరికి ఎక్కువగా నష్టం వాటిల్లింది.

ఆశాజనకంగా యాసంగి పత్తి

- నీటి వసతి ఉన్న చోట సాగు
- త్వరలో పంట చేతికి



శివలింగాపూర్ సమీపంలో సాగు చేస్తున్న యాసంగి పత్తి

చెన్నూర్‌రూరల్: పత్తి పంటను ఎక్కువగా వానాకాలంలో సాగు చేస్తారు. తొలకరి వర్షాలకు పత్తి విత్తనాలు విత్తుకుంటే దీపావళి వరకు పత్తి పంట చేతికి వస్తుంది. గత ఏడాది నుంచి నీటి సౌకర్యం ఉన్న రైతులు యాసంగిలో రెండవ పంటగా పత్తిని సాగు చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 20 పైగా గ్రామాలలో రైతులు 163 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. వర్షాకాలం సాగులో పత్తి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాల కారణంగా పత్తి పంటకు చీడ,పీడలు సోకి చాలా నష్ట పోయారు. యాసంగి పత్తికి ఎక్కువగా తెగుళ్ల బెడద తక్కువగా ఉండటం, మంచి దిగుబడి వస్తుండడంతో రైతులు యాసంగిలో పత్తి పంటను సాగు చేస్తున్నారు.

పంట సాగు ప్రారంభం...

నవంబర్, డిసెంబర్ నెలల్లో యాసంగి పత్తి విత్తనాలను విత్తారు. రైతులు యాసంగిలో ఎకరం పత్తి సాగుకు సుమారు రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టారు. నీటి వసతి ఉన్న రైతులతో పాటు కొందరు కౌలు రైతులు కూడా యాసంగిలో పత్తి సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు యాసంగి పత్తిలో చీడ, పీడలకు మందులను పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉండటంతో చీడ, పీడల బెడద తక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పత్తి పంటకు పేనుబంక సోకవడంతో వ్యవసాయాధికారుల సూచనల మేరకు నివారణకు మందులు స్ప్రే చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంటకాయ దశకు చేరుకుంది. ఈ నెల చివరి వారం వరకు పంట చేతికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు సుమారు 10 నుంచి 12క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. వచ్చే యాసంగికి పత్తి సాగు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

15ఎకరాల్లో పత్తి సాగు చేశాను..



శివలింగాపూర్ గ్రామం వద్ద 15ఎకరాల్లో యాసంగి పత్తి సాగు చేశాను. వ్యవసాయాధికారుల సూచనల మేరకు చీడ, పీడలను నివారించడం జరుగుతుంది. ప్రస్తుతం పత్తి కాయ దశలో ఉంది. ఈ నెల చివరి వారం లోగా పంట చేతికి వస్తుంది. –రాజేశ్, రైతు

సలహాలు, సూచనలు అందిస్తున్నాం



యాసంగిలో పత్తి పంట సాగు చేసిన రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. శివలింగాపూర్ వద్ద రైతులు పత్తి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంట ఆశాజనకంగా ఉంది.

–రాజశేఖర్, ఏఈవో

నీటి వసతి ఉన్న రైతులు సాగు చేయాలి



నీటి వసతి ఉన్న రైతులు రెండవ పంటగా వరికాకుండా పత్తి పంటను సాగు చేసుకోవచ్చు. యాసంగిలో పత్తికి చీడ పీడలు, తెగుళ్లు ఎక్కువగా సోకవు. యాసంగిలో పత్తి సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలి. –కవిత, ఏవో, చెన్నూర్